ఇంటింటా పింఛన్ల పండుగ

- రూ. 3 వేలు పెంపుతో లబ్ధిదారుల హర్షం
- వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా



కొక్కిరపాడులో బత్తుల రత్నాంబకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ రెడ్డియ్య, ఎంపీటీసీ బుజ్జి

దెందులూరు: నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ఇంటింటా పెన్షన్ల పండగ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవన విధానం మెరుగయ్యేందుకు రూ.3 వేల వరకూ పెన్షన్ పెంచుతామని నాడు ఇచ్చిన హామీ నేడు అమలు కావడంతో వేలాది మంది లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దైనందిన జీవితంలో అల్పాహారం, భోజనం, మందులు, ఇతర ఖర్చులకు అవ్వాతాతలు ఎవరిపై ఆధారపడకుండా పింఛన్ అందిస్తూ సీఎం జగన్ మా పాలిట దేవుడిగా అండగా నిలిచాడని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో కొత్త పింఛన్ మంజూరు కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని, అప్పటికే ఉన్న లబ్ధిదారుల్లో ఎవరైనా చనిపోతే గాని వారి స్థానంలో మరొకరికి అవకాశం ఉండేది కాదని వారన్నారు. అరకొర పింఛన్ సొమ్ముకు గంటల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేదని వృద్ధులు అన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో వలంటీర్లు తెల్లవారుజామున 5.30 గంటలకే తలుపు తట్టి పింఛన్ నగదును అందజేయడంతో ప్రభుత్వానికి పేద ప్రజలపై ఉన్న బాధ్యతను, ప్రేమను తెలియజేస్తోందని లబ్ధిదారులు అంటున్నారు.

దెందులూరు నియోజకవర్గంలో పింఛన్ల వివరాలు

మండలం	పెన్షన్లు	నగదు
దెందులూరు	9,812	రూ.2,95,37,500
ఏలూరు రూరల్	6,508	రూ.63,58,08,750
పెదవేగి	12,441	రూ.3,72,12,000
పెదపాడు	9,836	రూ.2,95,08,000

పేదల పాలిట పెన్నిధి సీఎం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట పెన్నిధి. తండ్రి వైఎస్సార్ ఆశయాలను నెరవేర్చేందుకు ఆయన అడుగుజాడల్లో పయనిస్తున్నారు. పేదల కోసం తన తండ్రి వైఎస్సార్ చేసిన దానికంటే మరో అడుగు ముందుకు వేస్తానని పాదయాత్రలోనే ఇచ్చిన హామీకి అనుగుణంగానే అధికారం చేపట్టాక వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో దేశమంతా ఏపీ వైపు చూసేలా పాలన సాగుతోంది.

– కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

గుండెనిండా ధైర్యాన్ని నింపారు



ఏభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, కుటుంబ పోషణ, ఇతర అవసరాలను అందించాలనే దూరదృష్టి పింఛన్‌తోపాటు ఇతర పథకాలు అమలు చేస్తున్నారు. రూ.3 వేలకు పింఛన్ సొమ్ము పెంచి లబ్ధిదారుల్లో గుండెనిండా ధైర్యాన్ని నింపారు. పింఛన్ పెంపు నిర్ణయం చాలా సంతోషంగా ఉంది.

– కట్టా వెంకట సుబ్బారావు, లబ్ధిదారుడు, దెందులూరు

రూ. 3 వేలు పెంపుతో ఆర్థిక భద్రత



నా భర్త ప్రమాదంలో చనిపోయారు. ప్రతి నెలా ఇకపై వచ్చే రూ.3 వేల పెన్షన్ నా కుటుంబ పోషణకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. పెన్షన్ మంజూరు కావడంతో మా కుటుంబానికి ఆర్థిక భద్రత లభించింది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

– పీ వేదకుమారి, లబ్ధిదారురాలు, మేధినరావుపాలెం

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పల్లెకి పోదాం కార్యక్రమం మండలంలోని యర్రమల్లెపాడు, కంసాలిగుంట గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు గ్రామాలకు సంబంధించి సంక్షేమం, అభివృద్ధి పథకాలకు సుమారు రూ.19 కోట్ల నిధులు ప్రభుత్వం ఖర్చు చేసినట్టు తెలిపారు. తొలుత గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను తెలిపే డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాలను గ్రామ సభలో ప్రజలకు వివరించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించి, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల కన్వీనర్ మరడా వెంకట రంగారావు, చేబ్రోలు సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, మండల సచివాలయ కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఈవోపీఆర్‌డీ శంషుద్దీన్, ఆర్‌బీకే చైర్మన్ నెక్కంటి దుర్గాప్రసాద్, నాయకులు చిలుకూరి శివయ్య, మధు, నక్క వాసు, కంసాలగుంట నాయకులు పి.బాబ్జి, సచివాలయం కన్వీనర్ నెక్కంటి సరస్వతి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైబిల్ మిషన్ చర్చి ప్రారంభం



సత్యవోలులో బైబిల్ మిషన్ చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: మానవునికి ఆధ్యాత్మిక చింతన అవసరమని, దానికోసం తమ ఇష్టమైన దైవాన్ని ప్రార్థిస్తుంటారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో నూతనంగా నిర్మాణం చేసిన బైబిల్ మిషన్ చర్చిని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు క్రైస్తవ సోదరులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రార్థన కోసం ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసుకోవం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో బైబిల్ మిషన్ అధ్యక్షుడు రెవ.ఫాదర్ సజీవరావు, పాస్టర్ లాజర్, పలువురు గ్రామపెద్దలు విశ్వాసులు పాల్గొన్నారు.

దెందులూరు ఎస్సైగా స్వామి



ఎస్సై స్వామి

దెందులూరు: దెందులూరు సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా కే స్వామి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెదవేగి, చేబ్రోలు పోలీస్‌స్టేషన్లలో ఆయన పని చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కే స్వామి మాట్లాడుతూ శాంతి భద్రతల అదుపు, నేరాల నివారణ, ట్రాఫిక్, స్పందన తొలి ప్రాధాన్యతగా ఉంటుందన్నారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా కోడి పందేలు, పేకాటతో పాటు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, దెందులూరు పోలీస్‌స్టేషన్, ఎస్సై సెల్ నంబర్ 94407 96654కు సమస్యలు తెలియజేయాలని ఆయన సూచించారు.

భీమడోలు ఎస్సైగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ



భీమడోలు ఎస్సై యామన సుధాకర్

భీమడోలు: భీమడోలు ఎస్సైగా యామన సుధాకర్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సైల బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ ఎస్సైగా పని చేస్తున్న సుధాకర్‌ను భీమడోలుకు బదిలీ చేసారు. గతంలో ఈయన కృష్ణా జిల్లాలోని చల్లపల్లి, కోడూరు, కలిదిండి, సీతానగరంలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై యామన సుధాకర్ మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా తన వంతు కృషి చేస్తానన్నారు. కోడిపందేలకు, అసాంఘిక కార్యక్రమాలకు ఆస్కారం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలకు ఎంపిక

దెందులూరు: ఆడుదాం ఆంధ్రలో భాగంగా నిర్వహించిన పోటీల్లో పోతునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు మండలస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బ్యాడ్మింటన్ విభాగంలో వై. సత్యనారాయణ, దుర్గాప్రసాద్, కే.దీవెన మండల పోటీలకు ఎంపికయ్యారు. శనివారం మండల స్థాయికి ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ బోదుల స్వరూప్ అభినందించారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పెదపాడు: చట్టాన్ని ఉల్లంఘించి కోడి పందేలు, జూదాలు, గుండాట నిర్వహణ, అక్రమ మద్యం నిల్వలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పెదపాడు మండల తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, పోలీసు, పంచాయతీ రాజ్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ సువర్ణరాజు వీఆర్వోలు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

గణపవరం: విద్యార్థులు శాస్త్రవేత్తల కృషిని, వారి జీవనశైలిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, వారి ఆవిష్కరణలు, సమాజానికి వాటి ఉపయోగాలకు సంబంధించిన అదనపు సమాచారాన్ని సేకరించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆంగ్ల విభాగం అధిపతి అక్కిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టులను రూపొందించారు. ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులు సత్యప్రియ, కుమారి, దీపిక, ప్రతిమ, అంజిబాబు, మౌనిక, సత్యవతి, శిరీషకు ప్రిన్సిపల్ నిర్మలకుమారి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

టీడీపీకి రానున్నవి ఆఖరి ఎన్నికలు

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలు టీడీపీకి ఆఖరి ఎన్నికలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైకిల్‌కు అభ్యర్థులు లేరని, ఒకరు గాలి కొడతానంటే, మరొకరు బెల్ కొడతానంటున్నాడని ఎద్దేవాచేశారు. 2024 ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గ నుంచి వైఎస్సార్ సీపీ 50 వేల మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఆయన ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పాల్గొన్నారు. అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఒక్కొక్క గ్రామంలో రూ.50 కోట్లు నుంచి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇందులో తాగునీటి పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంకులు, బీటీ, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, సచివాలయాలు, ఆర్‌బీకే, ఆరోగ్యశ్రీ క్లినిక్‌లు ఉన్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 1.50 లక్షల మంది ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో సీఎం జగన్ వేల కోట్ల రూపాయలు అందించారని వివరించారు. అర్హులందరికీ సంక్షే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిలో ఒక్క శాతం కూడా టీడీపీ చేయలేదని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచేందుకు టీడీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రతిపక్షాల ప్రయత్నాలను ప్రజలే తిప్పికొట్టాలని కోరారు. వైఎస్సార్ సీపీని గెలిపించి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. యాత్రలో భాగంగా సర్పంచ్ గుడిపూడి రఘుతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకు తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ.50 కోట్లతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఇదే క్రమంలో సీసీ రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్, కుళాయి, పాఠశాల అభివృద్ధి పనులు, తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేశారు. సంప్రదాయ డప్పుల వాయిద్యంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆయన వెంట చాటపర్రు సొసైటీ చైర్మన్ శిరిపురపు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు గుత్తా గంగాభవాని, బోడిగడ్డ కుమారి, గుత్తా వెంకటేశ్వరరావు, బేబీ, పరుశురాం, శ్రీనివాస్, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, మండల కొండలరావు, తేరా ఆనంద్, బాపనయ్య, కొల్లేరు, దెందులూరు, పెదపాడు, పెదవేగి మండల నాయకులు ఉన్నారు.



చాటపర్రులో సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజా ఆశీర్వాదయాత్రలో ఎమ్మెల్యే కొఠారు

అపరాల్లో సస్యరక్షణ చర్యలు



అపరాల పంట క్షేత్ర పర్యటనలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు

పెదపాడు: అపరాల పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కే ఫణికుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో పెసర, మినుము, పంటల క్షేత్ర సందర్శన చేసారు. పెసర మినుము పంటల్లో బూడిద తెగులు, ఆకుమచ్చ తెగులు, పల్లాకు తెగులు, మరూకా మచ్చ పురుగులను గమనించామన్నారు. చలి వాతావరణం కారణంగా బూడిద తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుందని ఈ తెగులు గమనించిన వెంటనే నివారణకు బావిస్టన్ ఒక గ్రాము, ఒక లీటరు నీటికి లేదా హెక్సాకొనజోల్ 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పల్లాకు తెగులు ఆశించిన మొక్కలు పసుపు రంగులోకి మారి పత్రహరితాన్ని కోల్పోయి దిగుబడి గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. పల్లాకు తెగులు కారణంగా తెల్ల దోమ వ్యాప్తి చెందుతుందని దీని నివారణకు గ్రీజు పూసిన పసుపు రంగు అట్టలను పొలంలో అక్కడక్కడ ఏర్పాటు చేసి, వేప నూనె 5ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వారా తెల్లదోమ ఉధృతిని తగ్గించవచ్చన్నారు. మరూకా మచ్చ పురుగులు ఆకులను ఒక దగ్గరకు చేర్చి గూడు కట్టి నష్టం ఏర్పరుస్తుందని దీని నివారణకు ఇండాక్సికాబ్, నోవాల్యురాన్, కొరాజిన్ ఏదో ఒక మందును పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ పీ లలితా సుధ, పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ వట్లూరు ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

యువతలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకే 'ఆడుదాం ఆంధ్ర'



భీమడోలులో క్రీడాకారులకు టీషర్ట్స్, టోపీలను అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

భీమడోలు: యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దోహదపడుతుందని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక ఉన్నత పాఠశాలల్లో తొలి దశలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన వారికి శనివారం టీషర్ట్స్, టోపీలను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా భీమడోలు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో పద్మావతిదేవి మాట్లాడుతూ గత నెల 26వ తేదీ నుంచి జరిగిన తొలి విడత క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించగా వాటిలో విజేతలకు ఈనెల 10వ తేదీ నుంచి అయా ఆట స్థలాల్లో వేర్వేరుగా మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల వ్యాప్తంగా 17 సచివాలయాల్లో ఒకొక్క సచివాలయానికి 1,938 టీషర్ట్స్, టోపీలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఏ.సుందరి, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, గ్రామ కార్యనిర్వాహక అధికారి ఎస్.ఠాగూర్, వెంకట్రావు, పీడీలు, క్రీడాకారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



శ్రీరామవరంలో లబ్ధిదారురాలికి పెన్షన్‌ను అందజేస్తున్న కామిరెడ్డి నాని, కనుమూరి సావిత్రి

దెందులూరు: శ్రీరామవరంలో శనివారం లబ్ధిదారురాలు కొత్తపల్లి మరియమ్మకి పెన్షన్ నగదును మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఉపసర్పంచ్ కనుమూరి సావిత్రి, వార్డు మెంబర్లు అందజేశారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, కొత్తపల్లి రవీంద్ర, వార్డు మెంబర్లు, కామిరెడ్డి బాలు, ప్రతాప్, సాయి పాల్గొన్నారు.

173 మందికి కొత్తగా పింఛన్లు అందజేత

పెదపాడు: మండలంలో 173 మందికి కొత్తగా సామాజిక భద్రతా పింఛన్లు అందించినట్లు పెదపాడు ఎంపీడీవో సబ్బితినర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు మండలంలో 66 వృద్ధాప్య పింఛన్లు, 56 మంది వితంతువులు, 48 మంది వికలాంగులు, మత్స్యకారుడికి, ఇద్దరు ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

పింఛను లబ్ధిదారుల ఆనందం

గణపవరం: గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో అట్టహాసంగా సాగుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పెంచిన పింఛన్లు, కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మండలానికి కొత్తగా 170 మందికి పింఛన్లు మంజూరుకాగా, ఇప్పటికే 8,786 మంది పింఛన్లు పొందుతున్నారు. ఈనెల నుంచి పెంచిన పింఛను మొత్తం రూ.3వేల చొప్పున లబ్ధిదారులకు అందజేస్తున్నారు. పెంచిన మొత్తం అందుకుంటున్న పింఛదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి



పోలసానిపల్లిలో ఎండీఎం ఆహార పదార్థాలను రుచి చూస్తున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం సర్కారీ బడుల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందని భీమడోలు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. పోలసానిపల్లి -1 ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన వార్షిక తనిఖీ చేసారు. విద్యాశాఖ నిర్దేశించిన రికార్డులు, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. నాడు- నేడు నిధుల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్దలో వండించిన ఆహార పదార్థాలను రుచి చూసారు. నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.తులసి, టీచర్లు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలతో గ్రామోత్సవం



వాకపల్లిలో అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ చేస్తున్న రామ భక్తులు

గణపవరం: ఆదర్శవంతమైన జీవనం సాగించిన శ్రీరాముడు మనందరికీ ఆదర్శమని గణపవరం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నండూరి లీలావతి, మాజీ వైస్ ఎంపీపీ నండూరి గాంధీ అన్నారు. శనివారం గణపవరం మండలం వాకపల్లిలో అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర గ్రామంలో వైభవంగా నిర్వహించారు. తొలుత గ్రామంలోని రామాలయం వద్ద రామభక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ ఆదిమూలం శ్రీనివాస్ అక్షింతల పాత్రను నెత్తిన ధరించి మేళతాళాలతో, జైశ్రీరామ్ నినాదాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. వీధివీధినా తిరిగి ఇంటింటా అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు నండూరి శ్రీను, నండూరి రామకృష్ణ, నండూరి నాగేశ్వరరావు, అడ్డగర్ల పుల్లారావు, పొట్టిపోతుల రాంపండు, పొట్టిపోతుల మారెయ్య పాల్గొన్నారు.

అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ యాళ్ల శివప్రసాద్

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈరోజు భారత అంతరిక్ష ప్రయోగ ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ యాళ్ల శివ ప్రసాద్ విద్యార్థులకు భారతదేశంలో ఇస్రో సంస్థ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి, ఇటీవల చంద్రయాన్ 3 వరకు దేశంలో నిర్వహించిన అంతరిక్ష ప్రయోగాలను వివరించారు. ఉంగుటూరు మండల విద్యాశాఖ అధికారి-2 కే .శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో స్పేస్ టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యత ఉన్నందున విద్యార్థులందరూ దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం సైంటిస్టు యాళ్ల శివప్రసాద్, ఎంఈఓ-2 శ్రీనివాసరావును పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాస్‌కుమార్, కె.భువనేశ్వరి, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దిరాజు మాస్టార్‌కు ప్రశంసా పత్రం

భీమడోలు: ఆంధ్ర సారస్వత్ పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజమండ్రిలోని గైట్ కళాశాలలో నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొని పోలసానిపల్లికి చెందిన తెలుగు పండితుడు, పంగిడిగూడెం తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ మద్దాల పెద్దిరాజు తన ప్రతిభను చాటారు. ఆయన కవి సమ్మేళనంలో పాల్గొని సభికుల ప్రశంసలు పొందారు. పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా పతకం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్టు పెద్దిరాజు శనివారం తెలిపారు. పెద్దిరాజు సమకాలిన సామాజిక స్పృహను కలిగించే సాహితీ వ్యాసాలు, కవితలు రాస్తున్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



భీమడోలులో యూత్ కమిటీలను ప్రకటిస్తున్న మద్దుల రాజా, ఇంజేటి నీలిమ

భీమడోలు: రెండోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు తథ్యమని భీమడోలు ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ అన్నారు. భీమడోలులో శనివారం ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమతో కలిసి మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా గ్రామ స్థాయి యూత్ అధ్యక్షులను నియమించి వారి పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మద్దుల రాజా అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ కమిటీతో పాటు గ్రామ స్థాయి అధ్యక్షుల ఎంపికలో దళితులకు పెద్ద పీట వేశామన్నారు. గ్రామస్థాయి అధ్యక్షులుగా ఆరుగురు దళిత యువతకు అవకాశం ఇచ్చామన్నారు. భీమడోలుకు భీమడోలు గాంధీ, పూళ్లకు తాటిపాక ఆంజనేయులు, గుండుగొలనుకు కాలి రాజ్‌కుమార్, కురెళ్లగూడెంకు కలపాల రాజు, కోడూరుపాడుకు మానుకొండ ఆనంద్, దుద్దేపూడికి నీలం సత్యకొండలరావు, ఎంఎంపురానికి పెద్దిరెడ్డి హరీష్, లింగంపాడుకు కుచ్చెర్ల లివింగ్‌స్టన్, పోలసానిపల్లికి చెరుకు మధుబాబు, వడ్లపట్లకు నెల్లూరి తరుణ్‌కుమార్, అంబర్‌పేటకు జక్కుల అనిల్‌కుమార్, సూరప్పగూడెంకు పంతుల లక్ష్మీగణేశ్, పాతూరుకు కాళ్ల రాము, ఆగడాలలంకకు జయమంగళ రాధాకృష్ణ, చెట్టున్నపాడుకు జయమంగళ వెంకటరమణ, మల్లవరంకు బోయిన బాలాజీని నియమించారు.